నమస్తే తెలంగాణ

# హనుమకొండ

5 | వరంగల్, మంగళవారం 28 జనవరి 2025 | HANUMAKONDA




రైతు దీక్షలో మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

## మంత్రులు దోచుకుంటున్నరు

- కౌంటర్లు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నరు
- పాత బిల్లులకు 12 శాతం కమీషన్ తీసుకుంటున్నరు
- రైతు దీక్షలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 27 : అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ క్యాబినెట్ అంతా అవినీతిమయంగా మారిందని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. మంత్రులందరు కౌంటర్లు తెరిచి నేరుగా దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సోమవారం డివిజన్ కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచిస్తున్నదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల బిల్లుల కోసం వెళ్తున్న మాజీ ప్రజాప్రతినిధుల నుంచి 12 శాతం వరకు వసూలు చేస్తున్నారని, ముఖ్యంగా మంత్రి భట్టి విక్రమార్క సతీమణి కౌంటర్ ఏర్పాటు చేసి కమీషన్లు తీసుకుంటున్నదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఇవన్నీ తెలిసినా, ఆయన కూడా కమీషన్లు తీసుకుంటున్నందువల్లే వారిని అడ్డుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతో నిలదీస్తున్న ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలని సీఎం చేస్తున్నారన్నారు. అధికార పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజలకు జవాబుదారిగా ఉండాలే తప్ప గూండాగిరీ చేయొద్దని రాజయ్య హితవుపలికారు. కేసీఆర్ పాలనలో చేపట్టిన దేవాదుల పనుల ద్వారానే ప్రస్తుతం నియోజకవర్గంలోని 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నదన్నారు. కేసీఆర్ హయాంలో రైతు రాజుగా మారగా, కాంగ్రెస్ పాలనలో అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నాడన్నారు. హామీలు అమలయ్యే వరకు ప్రజలతో కలిసి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పదవులు అనుభవించిన కడియం శ్రీహరికి కేసీఆర్ కుటుంబంపై మాట్లాడే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, మాజీ జడ్పీటీసీ రవి, కుడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, మాజీ సర్పంచ్ సురేశ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, ఇనుగాల నర్సింహారెడ్డి, సేవెళ్లి సంపత్, కక్ర సోమిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చందర్‌రెడ్డి, నాయకులు లకావత్ చిరంజీవి, కుంభం కుమార్, బీ శ్రీనివాస్, కుమార్ గౌడ్, మహేందర్‌రెడ్డి, జయపాల్ రెడ్డి, నర్సింగం, భూపతిరాజు, మాచర్ల రఘురాములు, కనకం గణేశ్, నాగపురి పావని, ఎం సునీత, ఉడుమల భాగ్య, హీరాసింగ్, పొన్న రంజిత్, గొడుగు సంజీవ పాల్గొన్నారు.

## సర్వర్ డౌన్

- నిలిచిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ
- పది రోజులుగా ఇబ్బందులు పడుతున్న జనం

వరంగల్, జనవరి 27 : పది రోజులుగా సర్వర్ డౌన్ కావడంతో బల్దియా నుంచి జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ నిలిచిపోయింది. మీ సేవ కేంద్రాల్లో జనన, మరణ సమాచార నమోదు పూర్తిగా ఆగిపోయింది. సర్వర్ పనిచేయడం లేదంటూ కేంద్రాల నిర్వాహకులు చెప్తున్నారు. ప్రతి రోజూ వందల సంఖ్యలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాల చుట్టూ ప్రజలు తిరుగుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ డౌన్ ఉందని, తామేమీ చేయలేమని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అంటున్నారు. దీంతో ప్రజలు కార్పొరేషన్ కార్యాలయంలోని జనన, మరణ విభాగానికి వచ్చి వాకబు చేస్తుండగా, అక్కడా సర్వర్ స్లోగా ఉందని చెప్పి పంపుతున్నారు.






# గ్రేటర్‌కు మొండిచేయి

ఒక్కరికీ అందని సంక్షేమ పథకాలు

- వరంగల్ నగర పరిధిలో తొలి రోజు ఇవ్వని ప్రొసీడింగ్స్
- అర్బన్ మండలాల్లోని ప్రజల్లో నిరాశ
- లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం
- రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ, రైతు భరోసా కోసం నిరుపేదల ఎదురుచూపులు

*గణతంత్ర దినోత్సవం రోజున నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని గొప్పగా చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం తొలి రోజు గ్రేటర్‌కు మొండిచేయి చూపింది. హనుమకొండ, వరంగల్ జిల్లాలో అర్బన్ మండలాలను మినహాయించి మిగతా వాటిల్లో ఒక్కో గ్రామంలో ప్రొసీడింగ్స్ అందజేసింది. దీంతో హనుమకొండ, కాజీపేట, వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లోని ప్రజలకు నిరాశే ఎదురైంది. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యంతోనే జాబితా సిద్ధం కాలేదని తెలుస్తున్నది. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా కోసం నిరుపేదలు ఎదురుచూస్తున్నారు.*

*- వరంగల్, జనవరి 27*




పర్వతగిరి: జమాల్‌పురంలో మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందిస్తున్న అధికారులు (ఫైల్)

హనుమకొండ జిల్లాలోని 14 మండలాలకు 12, వరంగల్ జిల్లాలోని 13కు 11 మండలాల్లో ప్రొసీడింగ్‌లు పంపిణీ చేశారు. అయితే గ్రేటర్ కార్పొరేషన్‌లో మండలాలుగా ఉన్న హనుమకొండ, కాజీపేట, వరంగల్, ఖిలావరంగల్ మండలాల్లో ఒక్క లబ్ధిదారుడికి కూడా ప్రభుత్వం ప్రకటించిన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పెన్షన్లు అందజేయలేదు. హనుమకొండ, వరంగల్ జిల్లాలోని 27 మండలాలకు అర్బన్ పరిధిలోని 4 మండలాలను మినహాయించి మిగతా 23 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి అధికార పార్టీ నాయకులు ఆర్భాటంగా ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అర్బన్ మండలాల్లో మాత్రం అందజేయలేదు. దీంతో సంక్షేమ పథకాల కోసం ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురైంది.

### జాబితాలో రాజకీయ జోక్యం

అర్బన్ మండలాల్లో లబ్ధిదారుల జాబితా ఇంకా ఖరారు చేయనట్లు సమాచారం. వరంగల్, హనుమకొండ, కాజీపేట, ఖిలా వరంగల్ మండలాలు పూర్తిగా వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయి. తూర్పులో 24 డివిజన్లు, పశ్చిమలో 26 డివిజన్లు ఉంటాయి. ఒక్కో డివిజన్ నుంచి వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం ఇటీవల నిర్వహించిన వార్డు సభల్లో గ్రేటర్‌లో ఏకంగా 42,641 దరఖాస్తులు వచ్చాయి. అయితే అర్బన్ ప్రాంతంలో లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం ఎక్కువైందన్న విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు డివిజన్ల వారీగా తమ అనుకూలమైన పేర్లతో ఎమ్మెల్యేలకు జాబితా అందజేసినట్లు సమాచారం. లబ్ధిదారుల జాబితా ఎంపికలో అధికార పార్టీ నాయకుల జోక్యంతో అసలైన నిరుపేదలకు సంక్షేమ పథకాల జాబితాలో చోటు దక్కేనా అనే సందేహాలు కలుగుతున్నాయి.

## ప్రజా తిరుగుబాటు తప్పదు

- పాలనపై స్పష్టత లేని కాంగ్రెస్
- వాయిదాల సీఎం.. పూటకోమాటతో మోసం
- ప్రభుత్వ తీరుతో ఒత్తిడిలో అధికారులు
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట, జనవరి27: కాంగ్రెస్‌కు ప్రజా తిరుగుబాటు తప్పదని, స్పష్టత లేని పాలనను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాయిదాల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూటకో మాటతో ప్రజలను మోసం చేస్తున్నాడని అన్నారు. ప్రభుత్వ పనితీరు, ప్రజాగ్రహంతో అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26ను ఝూటా మాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందన్నారు. వంద రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పి 400 రోజులు దాటినా ఇప్పటికీ సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వని ఆసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. సర్కారు అస్పష్ట విధానాలతో అధికారులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని, ప్రజల్లో ప్రభుత్వ ఉద్యోగులపై గౌరవం తగ్గిపోతున్నదన్నారు. కేవలం ఒక్క శాతం పథకాలు మాత్రమే ప్రారంభించారని, ప్రజలను నిరాశ పరిచిన ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. పథకాల అమలు కోసం మండలానికి ఒక చిన్న గ్రామాన్ని ఎంచుకున్నారని, అన్ని గ్రామాల్లో అర్హులైన వారికి అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రారంభించిన పథకాల అమలుపై ప్రజలకు పూర్తిస్థాయిలో విశ్వాసం లేదన్నారు. ఈ నెల 26 నుంచి 4 పథకాలు అందిస్తామని చెప్పి ఇప్పుడు ఫిబ్రవరి మొదటి వారం నుంచి మార్చి 31 వరకు అమలు చేస్తామంటూ మరోమారు ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తున్నదన్నారు. రేవంత్ సర్కారు ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్క పథకం కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. ముఖ్యంగా రైతులకు రుణమాఫీ 30శాతం మాత్రమే చేసిందని, బోనస్, రైతు భరోసాపై కాంగ్రెస్ మాట తప్పి మోసం చేసిందన్నా రు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రైతు కూలీలను దగా చేసిందని, కౌలు రైతులకు భరోసాలో స్థానం లేకుండా చేసిందన్నారు. గ్రామసభల్లో ప్రజలు చూపించిన నిరసన ప్రారంభమేనని, భవిష్యత్తులో ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగలేరన్నారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులు, యువకులు, ఉద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను చూపిస్తున్నారని పెద్ది పేర్కొన్నారు.

## పాకాల ఏటిలో మొసళ్ల కలకలం

బయ్యారం, జనవరి 27: మండల కేంద్రం శివారులోని పాకాల ఏటిలో మొసళ్ల సంచారం కలకలం రేపింది. అటుగా వెళ్తున్న స్థానికులకు నీటి ప్రవాహంలో రెండు మొసళ్లు కనిపించాయి. వాహనాలు ఆపి వాటిని తిలకిస్తుండడంతో బ్రిడ్జిపై వెళ్తున్న వారు పెద్ద మొత్తంలో వచ్చి చూస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారిని పంపించారు. బంజారా తండా శివారులో చెక్ డ్యాం ఉండడంతో మొసళ్లు అక్కడే ఉండే అవకాశం ఉంది. నిత్యం చేపలు పట్టేందుకు జాలరులు, వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు అటుగా వెళ్తారని, అటవీ శాఖ అధికారులు మొసళ్లను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మొసళ్లు సంచరించిన పాకాల ఏటి ప్రాంతం

## బీటీ రోడ్డుకు బీటలు

- వేసిన కొద్ది గంటల్లోనే పగుళ్లు
- జాతీయ రహదారిపై నాసిరకం పనులు
- రోడ్డు పాలవుతున్న రూ. కోట్ల ప్రజాధనం
- ప్రమాదకరంగా మారుతున్న ప్రయాణం
- త్వరలోనే మేడారం మినీ జాతర



చిన్నబోయినపల్లి-తాడ్వాయి మధ్య జాతీయ రహదారిపై బీటలువారిన కొత్తగా వేసిన బీటీ



ఏటూరునాగారం, జనవరి 26 : జాతీయ రహదారిపై వేస్తున్న బీటీ లేయర్ బీటలువారుతున్నది. వేసిన కొద్ది గంటలకు పగుళ్లు ఏర్పడి ప్రయాణికులకు నరకం కనిపిస్తున్నది. రోడ్డు పటిష్టత కోసం వేస్తున్న బీటీ పట్టు లేకుండా పోయి ఒక వైపు వేస్తుంటేనే మరో వైపు లేచిపోతున్నది. నాసిరకం పనులతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే వెంకటాపురం, వాజేడు, మంగపేట మండలాల నుంచి ఓవర్ లోడుతో ఇసుక లారీల రాకపోకలు సాగిస్తుండడంతో జాతీయ రహదారి చాలా చోట్ల ప్రమాదకరంగా మారి అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఏటూరునాగారం నుంచి తాడ్వాయి వరకు రెండించుల లేయర్‌తో వేస్తున్న బీటీ లేయర్ అప్పుడే పగుళ్లు తేలితే త్వరలో జరగనున్న మినీ మేడారం జాతర నాటికి ఎలా ఉంటుందో అర్థం కాకుండా ఉంది. అటవీ ప్రాంతంలో రోడ్డు ఇలా ఉంటే రాత్రి వేళ ప్రయాణం ఎలా చేయాలంటూ వాహనదారులు వాపోతున్నారు. జాతర ముందు పగుళ్లు తేలేలా రోడ్డు పనులు చేస్తారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఏటూరునాగారం-తాడ్వాయి మధ్యలోని 11 కిలోమీటర్ల పొడవునా రూ. 9 కోట్లతో బీటీ లేయర్ వేస్తున్నారు. చిన్నబోయినపల్లి నుంచి తాడ్వాయి మధ్యలో ప్రస్తుతం కొన్ని కిలోమీటర్ల వరకు ఒక వైపు తారు వేయగా అనేక చోట్ల పగిలిపోయి ప్రజాధనం రోడ్డు పాలైంది. ఈ రోడ్డుపై మల్లూరు, బొగత జలపాతంతో పాటు త్వరలో జరగనున్న మేడారం జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఒకవైపు వేసిన బీటీ పగుళ్లు ఏర్పడడంతో తప్పని తెలిసినా వాహనదారులు మరోవైపున్న పాత రోడ్డుపై నుంచి వెళుతున్నారు.

### లోడు వాహనాలతోనే..

రోడ్డు పటిష్టత కోసం చేస్తున్న బీటీ పనులు నాణ్యతతోనే జరుగుతున్నాయి. బీటీ ఆరక ముందే లోడు వాహనాలు వెళుతున్నాయి. దీంతో రోడ్డు అక్కడక్కడా దెబ్బతింది. బీటీ వేసి రోలింగ్ చేసిన అనంతరం కింద ఉన్న పాత రోడ్డుకు అతుక్కునేందుకు కనీసం రెండు, మూడు గంటలు పడుతుంది. ఆ తర్వాత వాహనాలు వెళ్లాలి కానీ వాహనదారులు బీటీ పచ్చిగా ఉన్నపుడే వెళుతున్నారు. దీనికి తోడు పాత రోడ్డు నున్నగా ఉండడంతో సరిగా అతుక్కోక లోడు వాహనం వెళ్లినపుడు తారు కదలడంతో పగులుతున్నది. దెబ్బతిన్న చోట బీటీ తొలగించి ప్యాచ్ పనులు చేస్తున్నారు. నాలుగేళ్ల పాటు రోడ్డు దెబ్బతింటే మరమ్మతుల బాధ్యత కాంట్రాక్టర్‌దే.

– కుమారస్వామి, ఎన్‌హెచ్ డీఈఈ

## ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతుల ఆందోళన

లో వోల్టేజీతో పంటలు ఎండుతున్నాయని నిరసన



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కాటారం, జనవరి 27 : విద్యుత్ సమస్య పరిష్కరించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం శంకరంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోక లో వోల్టేజీతో పంటలు ఎండిపోతున్నాయని, యాసంగి నాట్లు వేసే పరిస్థితి లేదని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు 14 వ్యవసాయ బోర్లతో పాటు గ్రామానికి నీటిని సరఫరా చేసే బోర్ కనెక్షన్ ఉందన్నారు. దీనిని 100కేవీగా అప్‌గ్రేడ్ చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పక్కనే ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ తక్కువగా ఉందని, దానికైనా కొన్ని బోర్ల కనెక్షన్లు ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. రైతులు మునిస్వామి, సంతోష్, రాజయ్య, బాపు, ఓదెలు, నర్సయ్య, గౌరయ్య, స్వామి, బతుకమ్మ, సమ్మయ్య, శంకరయ్య, రాజయ్య తదితరులున్నారు.


## కూలి పనులకు వచ్చి .. రోడ్డు ప్రమాదానికి గురై..

- ఆర్టీసీ బస్సు, ఆటో ట్రాలీ ఢీ
- ట్రాలీలో ప్రయాణిస్తున్న ఒక మహిళ మృతి
- మరో 12 మందికి తీవ్ర గాయాలు
- అంబాల-గూడూరు గ్రామాల మధ్య ఘటన

కమలాపూర్, జనవరి 27 : మహిళ కూలీలు పనులకు వచ్చి.. తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన సోమవారం అంబాల-గూడూరు గ్రామాల మధ్య జరిగింది. హసన్‌పర్తి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన మౌలానాబీ, షకీనా, ఆసియా, సఫియా, కరీమా, షమీబీ, షేక్ అబ్దుల్లా, ముంతాజ్‌బేగం, మైమునాబీ, కరీనాబీ, సమీనాబీ, గౌసియా, రంజాన్, రఫియా, అంకూస్‌బీ, మౌలానీ, సఫియా, అస్మా, సయ్యద్ గౌసియా, గరీమ్‌బీ, కమాలీ, హుస్సేన్‌బీతో పాటు మరో ఇద్దరు మహిళలు కూలి పనుల కోసం ఆటో ట్రాలీలో మండలంలోని వంగపల్లి గ్రామానికి వచ్చారు. పనులు ముగించుకుని ట్రాలీలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. గూడూరు-అంబాల గ్రామాల మధ్య హనుమకొండ నుంచి కమలాపూర్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు, హసన్‌పర్తి వెళ్తున్న ఆటో ట్రాలీ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో ట్రాలీ బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న 24మంది మహిళ కూలీలు కింద పడిపోయారు. 13మందికి తీవ్రగాయాలు కాగా 9మందికి స్వల్పగాయాలయ్యాయి. అందులో హుస్సేన్‌బీ (45)మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. కూలీల అర్తనాదాలతో రోడ్డుపై భీతావహ వాతావరణం నెలకొంది. అరగంట పాటు రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, ప్రజలు వెంటనే స్పందించి బోల్తాపడిన ట్రాలీ కింద, డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మహిళలను బయటకు తీశారు. విషయం తెలుసుకున్న సీఐ హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కమలాపూర్, హసన్‌పర్తి, నడికూడ, హనుమకొండకు చెందిన 108 వాహనాల్లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ భానుకిరణ్, డిపో మేనేజర్ ధరమ్‌సింగ్, కాజీపేట ఏసీపీ తిరుమల్, చేరాలు పరిశీలించారు. కాగా, రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతిచెందడంతో పాటు పలువురు గాయపడడంతో హసన్‌పర్తి మండలంలోని మునిపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.



రోడ్డుపై బోల్తా పడిన ట్రాలీ



శాసనాన్ని చూపుతున్న రెడ్డి రత్నాకర్‌రెడ్డి

## అగ్గలయ్య గుట్టపై శాసనం

చరిత్ర పరిశోధకుడు రత్నాకర్ రెడ్డి

హనుమకొండ, జనవరి 27: హనుమకొండలోని అగ్గలయ్య గుట్టపై శాసనం వెలుగులోకి వచ్చింది. చరిత్ర పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి నితిన్, గణేశ్‌తో కలిసి గుట్టకు మధ్యలో కనిపించే వరసిద్ధి వినాయక దేవాలయాన్ని సందర్శించారు. ఆలయానికి వెళ్లేందుకు ఇళ్ల మధ్యలో నుంచి పోతుంటే మెట్ల మార్గం మొదలయ్యే చోట కుడి వైపు 10వ శతాబ్దం నాటి కన్నడ శాసనాన్ని ప్రాథమికంగా గుర్తించినట్లు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. శాసనం పైభాగంలో మెట్ల మార్గం గుండా పైకి ఎక్కితే సముద్రమట్టానికి 215 మీటర్ల ఎత్తులో రాష్ట్ర కూటులకాలం నాటి చతుర్భుజ వినాయక శిల్పం ఉందన్నారు. అలాగే భద్రకాళి చెరువు రాష్ట్రకూటుల కాలంలో తవ్వించినట్లు తెలుస్తున్నదని చెప్పారు. పూర్వం దీనిపేరు 'అగాలయ చెరువు' అనడానికి అవకాశం ఉందని, ఇది అగ్గలయ్య గుట్టను ఆనుకునే ఉంటుందన్నారు. ఈ కారణంగా అగాలయ గుట్ట క్రమంగా గగ్గలయ్య గుట్టగా వ్యవహారంలో స్థిరపడిందని పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం కృష్ణరాజుపేట తాలూకా మాండ్య జిల్లాలో 'అఘాలయ' అనే గ్రామంలో మల్లీశ్వరుడిని పాపాలు పోగొట్టే దేవుడిగా పూజిస్తారని తెలిపారు.


### గుట్టపై గుప్తనిధుల తవ్వకాలు

వరసిద్ధి వినాయక ఆలయం వెనుక గుహ లోపలి నుంచి మార్గం ఉంది. ఇటీవల ఇక్కడ గుప్త నిధుల కోసం10 అడుగుల గొయ్యి తవ్వారు. దీని లోపలి నుంచి చూస్తే పెద్ద ఇటుకల వరుసలు ఉన్నాయి. ఇక్కడొక ఇటుకల నిర్మాణం ఉండేదని తెలుస్తున్నది. వరసిద్ధి వినాయకస్వామి ఆలయం పైభాగంలో రామలక్ష్మణులు అని పిలిచే చెట్లు ఉన్నాయని, ఇక్కడి నుంచి హనుమకొండతో పాటు ఆకాశం నేలకు తాకే చోటును కూడా చూడవచ్చని, సూర్యోదయం చూసే వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేయవచ్చన్నారు. శాసనం పరిశీలించిన తర్వాత ఈ గుట్ట చరిత్ర మరింత తెలిసే అవకాశం ఉందని రత్నాకర్ రెడ్డి తెలిపారు.

## విద్యార్థుల మధ్య ఘర్షణ

- ఒకరికి తీవ్ర గాయాలు
- ఒగులాపురం సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఘటన

దామెర, జనవరి 27: హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఒగులాపురం సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులు తోటి విద్యార్థిపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. హాస్టల్‌లో ఆరో తరగతి చదువుతున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లికి చెందిన గుత్తికొండ కౌశిక్(11) క్లాస్‌లీడర్‌గా ఉన్నాడు. గుట్కాలు, సిగరెట్లు తాగుతున్నామంటూ తమపై ప్రిన్సిపాల్‌కు తప్పుడు సమాచారం ఇస్తున్నావంటూ కౌశిక్‌ను కొంతమంది విద్యార్థులు వారం రోజుల క్రితం చితకబాదారు. ఆదివారం గణతంత్ర వేడుకలు ముగిసిన తరువాత మరోసారి అతడిపై దాడి చేశారు. అపస్మారక స్థితికి చేరుకున్న కౌశిక్‌ను చికిత్స కోసం ఉపాధ్యాయులు గుట్టుచప్పుడు కాకుండా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఘటనపై వివరణ కోసం ప్రిన్సిపాల్ సమ్మయ్యను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



గుత్తికొండ కౌశిక్



వీపుపై గాయాలు చూపుతున్న విద్యార్థి కౌశిక్

